




జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 29 | డిసెంబర్ | 2025 ◆ పేజీలు : 7

# సింగరేణి భవన్ వివాదంపై...
# యాజమాన్యం మౌనం?

- నిబంధనల ఉల్లంఘనకు మౌన అంగీకారమా?
- ఖండనల వెనుక కప్పిపుచ్చే ప్రయత్నమా?
- వాట్సాప్ ప్రకటనపై మరిన్ని ప్రశ్నలు..
- ఐఎన్ టీయూసీ నేతల చిత్తశుద్ధిపై విమర్శలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 28, (ప్రజాజ్యోతి) :** సింగరేణి భవన్ లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై "ఐఎన్ టీయూసీ కబ్జాలో..సింగరేణి భవన్!?" పేరిట వెలువడిన వార్తకు విస్తృత స్పందన వచ్చినప్పటికీ, ఇప్పటివరకు సింగరేణి యాజమాన్యం నుంచి గానీ, ప్రభుత్వ వర్గాల నుంచి గానీ ఎలాంటి అధికారిక వివరణ రాకపోవడం కొత్త ప్రశ్నలకు తావిస్తోంది. హైదరాబాద్ లోని సింగరేణి భవన్ కార్యాలయాన్ని రాజకీయ ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలకు వేదికగా మార్చినట్లు వచ్చిన ఆరోపణలపై మౌనం కొనసాగుతుండటంతో, ఇది నిబంధనల ఉల్లంఘనకు మౌన అంగీకారమా అన్న సందేహాలు కార్మిక వర్గాల్లో బలపడుతున్నాయి. పూర్తి స్థాయి సీఎండీ లేని పరిస్థితిని ఆసరాగా చేసుకుని, కాంగ్రెస్ పార్టీకి అనుబంధమైన ఐఎన్ టీయూసీ నేతలు సింగరేణి భవన్ లో


ప్రజాజ్యోతి
28 Dec 2025 - Page 1
2 లో..
ఐఎన్ టీయూసీ కబ్జాలో..
సింగరేణి భవన్!?
● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి
- సీఎండీ సీట్లో యూనియన్ నేత..
- 136 ఏళ్ల చరిత్రకు సిగ్గుచేటు
- ప్రభుత్వ అస్సైపై పార్టీ అనుబంధ యూనియన్ ఆధిపత్యం
- సింగరేణి పరిపాలన ఎవరి చేతుల్లో ఉంది?
- పూర్తి స్థాయి సీఎండీ లేని వేళ
యూనియన్ రాజ్యం?

సమావేశాలు నిర్వహించారని, అదీ సీఎండీ స్థాయి సమావేశాల కోసం వినియోగించేహాల్ లోనేకార్య క్రమం సాగిందన్న ఆధారాలు ఉన్నాయి. దీనిపై ఇప్పటి వరకు యాజమాన్యం స్పందించకపోవడంతో "ఇది అధికారిక అనుమతితో జరిగిందా? లేక చూసీ చూడనట్టు వదిలేశారా?" అన్న ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. ఇదే సమయంలో మరో కీలక అంశం తీవ్ర చర్చకు వస్తోంది. ఐఎన్ టీయూసీ ప్రస్తుతం గుర్తింపు సంఘం కాదు, కేవలం ప్రాతినిధ్య సంఘం మాత్రమే. అలాంటి సంఘానికి ఈ స్థాయిలో సమావేశాలు నిర్వహించే హక్కులేమిటి? సీఎండీ, డైరెక్టర్లు కూర్చునే వేదికలను

మిగతా 2 లో...



- విద్యుత్ కాంతులు, హంస వాహన అలంకరణలతో కళకళలాడిన ఆలయ పరిసరాలు

# ముక్కోటి ఏకాదశికి భద్రాద్రి రామాలయం దివ్యశోభ

**భద్రాచలం , డిసెంబర్ 28, ప్రజాజ్యోతి :** ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం పరిసర ప్రాంతాలు సర్వాంగసుందరంగా అలంకరించబడ్డాయని దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ ప్రాంగణమంతా రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులతో ప్రకాశిస్తూ భక్తులను ఆధ్యాత్మిక ఉత్సాహంతో నింపింది. ప్రత్యేకంగా రామాలయాన్ని విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించడంతో రాత్రి వేళ ఆలయం దివ్యంగా దర్శనమిచ్చింది. ముక్కోటి ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న తెప్పోత్సవానికి ఉపయోగించే హంస వాహనాన్ని కూడా పూలమాలలు, విద్యుత్ దీపాలతో అద్భుతంగా అలంకరించారు. గోదావరి నదిలో హంస వాహనంపై స్వామివారి

మిగతా 2 లో...

# ముక్కోటి–వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు సర్వం సిద్ధం

- విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**భద్రాచలం, డిసెంబర్ 28,ప్రజాజ్యోతి:** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాద్రి శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించనున్న ముక్కోటి–వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని, విధుల్లో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హెచ్చరించారు. ఆదివారం భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని చాంబర్ లో వివిధ శాఖల

మిగతా 2 లో...

# ప్రజా సంక్షేమమే మా లక్ష్యం...

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం
- నూతన పంచాయితీ భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



**చర్ల, డిసెంబర్ 28 :(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం లో ఆదివారం గొంపల్లి, కేశవాపురం, కలివేరు , సత్యనారాయణపురం, గ్రామాలలో ఒక్కొక్కటి రూ 20 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం ఎల్ ఏ డాక్టర్ తెల్లం వెంకటరావు మాట్లాడుతూ సర్పంచ్ లు

మిగతా 2 లో...

## ముక్కోటి–వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు సర్వం సిద్ధం



(మొదటి పేజీ తరువాయి...)

అధికారులతో శ్రీ సీతా రామ చంద్ర స్వామి వారి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం నిర్వహణపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం పరిసర ప్రాంతాలు సర్వాంగసుందరంగా అలంకరించబడ్డాయని తెలిపారు. ఆలయ ప్రాంగణం మొత్తం చలువ పందిళ్లు, మామిడితోరణాలు, పూలమాలలు, విద్యుత్ దీపాలతో భక్తిశ్రద్ధలతో నిండిన ఆధ్యాత్మిక వాతావరణంలో కళకళలాడుతోందని పేర్కొన్నారు. కరకట్ట, రామాలయ పరిసరాలు, సూపర్ బజార్ సెంటర్, బ్రిడ్జి పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయని అన్నారు. వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి తొమ్మిది రోజుల పాటు తొమ్మిది అవతారాలలో భక్తులకు దర్శనమిచ్చారని, ప్రతిరోజూ స్వామివారి అవతార దర్శనం భక్తుల్లో భక్తిశ్రద్ధలను మరింత పెంచుతూ అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా డిసెంబర్ 29 సాయంత్రం గోదావరి తీరంలో నిర్వహించనున్న తెప్పోత్సవానికి హంస వాహనాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. గోదావరి నదిలో హంస వాహనంపై భద్రాద్రి సీతారామచంద్ర స్వామి విహారం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని అందించనుందని పేర్కొన్నారు. అలాగే డిసెంబర్ 30 తెల్లవారుజామున ఉదయం 5 గంటలకు స్వామివారు ఉత్తర ద్వారం (వైకుంఠ ద్వారం) ద్వారా వైకుంఠ రాముడిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ప్రాంతాలను సెక్టార్లుగా విభజించి, క్యూలైన్ల నిర్వహణ, భద్రతా చర్యలు, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారుల సమన్వయంతో పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. భద్రాచలానికి విచ్చేసే భక్తులు శ్రీ రామ దర్శనంతో పాటు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను కూడా సందర్శించాలని ఆయన సూచించారు. గోదావరి నదిలో ఏర్పాటు చేసిన బోటింగ్ సౌకర్యం, ఘాట్ల సహజ సౌందర్యం, నది ఒడ్డున ఏర్పాటు చేసిన గుడారాలలో రాత్రి బస సదుపాయాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయని అన్నారు. అలాగే ఐటీడీఏ గిరిజన మ్యూజియం, బోజ్జికుప్ప–బెండలంపాడు ట్రెక్కింగ్, కిన్నెరసాని పరివాహక ప్రాంతాల సహజ అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. ఈ పర్యాటక, సాంస్కృతిక ఏర్పాట్లలో మహిళా సమాఖ్యల ద్వారా ఎక్కువ భాగం నిర్వహించడం జరిగిందని, దీని వల్ల స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. భక్తులు దర్శనం అనంతరం క్రమశిక్షణ పాటిస్తూ, అధికారులు సూచించిన మార్గాల్లోనే ప్రయాణిస్తూ, శాంతియుతంగా ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముక్కోటి–వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు భద్రాద్రిలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా, భక్తులకు మరపురాని అనుభూతిని కలిగించేలా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం జరిగే ప్రదేశాల్లో వీవీఐపీ, వీఐపీ, మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు కోసం కేటాయించిన సెక్టార్లలో సంబంధిత అధికారులు వారి ప్రవేశానికే అనుమతి ఇవ్వాలని సూచించారు. శాఖల వారీగా అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మంచినీటి సౌకర్యం, మెడికల్ క్యాంపులు, అగ్నిమాపక శకటాలు, సమాచార కేంద్రాలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మ్రిణాళి శ్రేష్ట, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ మురళి తదితర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి భవన్ వివాదంపై యాజమాన్యం మౌనం?

(మొదటి పేజీ తరువాయి...)

వినియోగించే అధికారం ఎవరు ఇచ్చారు? అన్న విషయాలపై ఇప్పటివరకు స్పష్టత లేకపోవడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. గుర్తింపు పొందిన యూనియన్లకే సాధారణంగా లభించే వేదికలు, అధికారిక హంగులు ఒక ప్రాతినిధ్య సంఘానికి ఎలా దక్కాయన్న ప్రశ్నలు కార్మికుల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. ఈ వివాదం మధ్య, సింగరేణి డైరెక్టర్ (పా)గా ఉన్న ఐఏఎస్ అధికారి గౌతమ్ పోట్రు కూడా అదే సమయంలో సింగరేణి భవన్ లోనే ఉన్నారన్న సమాచారం కార్మిక వర్గాల్లో మరిన్ని అనుమానాలకు దారి తీసింది. పరిపాలనా క్రమశిక్షణను కాపాడాల్సిన స్థాయిలో ఉన్న అధికారి సమక్షంలోనే ఈ పరిణామాలు కొనసాగడాన్ని మౌన అంగీకారంగా భావించాలా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, ఇది ఒక్కరోజు జరిగిన సమావేశం కాదని, యాజమాన్య శూన్యతను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ రంగ సంస్థల్లో రాజకీయ జోక్యం పెరుగుతోందన్న భావన కార్మికుల్లో బలంగా వ్యక్తమవుతోంది. ఈ ధోరణి కొనసాగితే రేపు ఇతర యూనియన్లు కూడా ఇదే విధంగా సింగరేణి భవన్ ను ఆశ్రయించే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సింగరేణి భవన్ వినియోగానికి సంబంధించిన నిబంధనలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ఈ సమావేశాలకు అనుమతి ఇచ్చిన అధికారులు ఎవరో తేల్చాలని కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్టు తేలితే, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందేనని వారు స్పష్టం చేస్తున్నారు.

### ఖండనల వెనుక కప్పిపుచ్చే ప్రయత్నమా..?

సింగరేణి భవన్ లో జరిగిన అనధికార సమావేశాలపై వెలువడిన వార్తలకు ప్రతిగా, కాంగ్రెస్ పార్టీకి అనుబంధమైన ఐఎన్ టీయూసీ ప్రాతినిధ్య సంఘం నేతలు ఒక వాట్సాప్ సందేశాన్ని విడుదల చేశారు. కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల నెరవేర్పు అంశంపైనే సమావేశం ఏర్పాటు చేశామని, తమపై జరుగుతున్న ప్రచారాలు తప్పుడు సమాచారమని ఆ సందేశంలో పేర్కొన్నారు. అయితే ఈ ఖండన మరిన్ని సందేహాలకు తావిస్తోందని కార్మిక వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. వాట్సాప్ ఖండనలో చెప్పినట్టుగా నిజంగా కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యమైతే, గతంలో ఎన్ని హామీలు అమలయ్యాయన్న ప్రశ్న సహజంగా ముందుకు వస్తోందని వారు అంటున్నారు. ముఖ్యంగా ఐఎన్ టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ చిత్తశుద్ధిపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ స్థాయి హోదాలో ఉన్నప్పటికీ, ఆయన ద్వారా ఇప్పటివరకు ఏ ఒక్క కార్మిక హామీ కూడా నెరవేరలేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. “నెలకు లక్షల రూపాయల జీతం తీసుకుంటూ ఆ హోదాను అనుభవించినా, ఇటు సింగరేణి కార్మికులకు గానీ, అటు రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు గానీ ఉపయోగపడే ఒక్క నిర్ణయం కూడా తీసుకురాలేదు” అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సింగరేణి భవన్ చుట్టూ తిరుగుతూ పైరవీలు చేయడం తప్ప, కార్మికుల సమస్యల పరిష్కారంలో స్పష్టమైన ఫలితాలు లేవన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల సీఎండీ స్థాయి సమావేశ హాల్ లో యాజమాన్యాధికారానికి ప్రతీకగా ఉన్న సీటులో కూర్చుని సమావేశం నిర్వహించి, అనంతరం దాన్ని కప్పిపుచ్చేందుకు కార్మికుల సమస్యలపై విస్తృత చర్చ జరిగిందంటూ ప్రకటనలు విడుదల చేశారన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి. దీంతో ఇది నిజమైన సమస్యల పరిష్కార ప్రయత్నమా, లేక విమర్శల నుంచి తప్పించుకునే వ్యూహమా అన్న ప్రశ్న మరింత బలపడుతోంది. మొత్తంగా చూస్తే, ఒక వైపు ఖండన సందేశాలు విడుదల చేస్తూనే, మరో వైపు గత హామీల అమలుపై స్పష్టత లేకపోవడం ఐఎన్ టీయూసీ నేతల ఉద్దేశాలపై తీవ్రమైన సందేహాలను పెంచుతోందని కార్మిక వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. సింగరేణి భవన్ లో జరిగిన సమావేశాలు నిజంగా కార్మికుల కోసమైతే, ఇప్పటివరకు అమలైన హామీల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని, లేనిపక్షంలో ఈ ఖండనలు కేవలం కప్పిపుచ్చే ప్రయత్నంగానే మిగిలిపోతాయని వారు స్పష్టం చేస్తున్నారు. అయితే ఈ నేతలపై ఉన్న అనుమానాలకు సంబంధించిన మరికొన్ని విషయాలు ఇంకా బయటపడాల్సి ఉండటంతో, ఈ అంశం రాష్ట్ర స్థాయిలో మరింత చర్చకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

## ప్రజా సంక్షేమమే మా లక్ష్యం...

(మొదటి పేజీ తరువాయి...)

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని ఇందుకు కార్యదర్శులు, పాలకవర్గాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వ నిధులు విడుదల కానున్నాయని, ఈ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని ముందుగానే ఏఏ అభివృద్ధి పనులు చేపట్టాలో సర్పంచ్ లు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కేశవాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ కాపుల శారద అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామానికి కావలసిన రహదారిని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మరో మూడు నెలల్లో రహదారి నిర్మాణం చేపట్టి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఏజెన్సీ అభివృద్ధికి రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. త్వరలో మూడున్నర కోట్ల వ్యయంతో మండలంలోని పెద్దమిడిసిలేరు గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందు గాను తహసీల్దార్ శ్రీనివాస్ భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏప్రిల్ నుండి రెండో విడత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పేదలు అధైర్య పడవద్దని, ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ఫలాలను అందించేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ లు ఇందిరమ్మ కమిటీలతో సమన్వయంతో పనిచేసి ఇళ్ల లబ్ధిదారులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహిళలను లక్షాధికారులను చేసే దిశగా పయనిస్తోందని తెలిపారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రుణాలు, స్వయం ఉపాధి పొందేందుకు ఆర్టీసీ బస్సుల కేటాయింపు, చీరల పంపిణీ, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, కళ్యాణ



లక్ష్మి వంటి అనేక పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు . మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లలో చర్ల మండలానికి 1200 కు పైగా మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొంపల్లి సర్పంచ్ అశోక్ కుమార్, ఉప సర్పంచ్ లోకేష్ కుమార్, లింగాపురం సర్పంచ్ గగులోత్ మంగ, ఉప సర్పంచ్ తడికల నరేష్, చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావ్, కేశవపురం సర్పంచ్ కాపుల శారద, కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణరావు, సత్యనారాయణపురం సర్పంచ్ చిక్కాల గౌతమి, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీ ఓ వలి హజరత్, పంచాయతీరాజ్ ఏఈ వాసుదేవరావు, మిషన్ భగీరథ ఏఈ రాము, గృహ నిర్మాణ శాఖ ఏఈ ముఖేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, కొటేరు శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, నాయకులు పరుచూరి రవికుమార్, జవ్వాది రవికుమార్, చీమలమర్రి మురళీకృష్ణ, బండారు రామకృష్ణ, సుందరి సురేష్, ఇందల బుచ్చిబాబు, పోలిన లంక రాజు, నాని బాబు రాజు, కాకర్ల సత్యేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ముక్కోటి ఏకాదశికి భద్రాద్రి రామాలయం దివ్యశోభ

(మొదటి పేజీ తరువాయి...)

విహారం భక్తులకు అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించనుందని అధికారులు తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వారం (ఉత్తర ద్వారం) ద్వారా స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చే విశేష ఘట్టం జరుగనుంది. ఈ రోజున దర్శనం చేస్తే వైకుంఠ లోక ప్రాప్తి కలుగుతుందన్న విశ్వాసంతో లక్షలాది భక్తులు భద్రాచలానికి తరలివస్తారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని దేవస్థానం అధికారులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిన భద్రాద్రి క్షేత్రం ముక్కోటి ఏకాదశి సందర్భంగా దివ్యధామంలా మారిందని పలువురు భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.



# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం: ఎమ్మెల్యే





**ఇల్లందు, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి:** దేశంలోని అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ వేడుకలను వేడుకలను పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. కూరగాయల మార్కెట్ వద్ద కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల వద్ద ఎమ్మెల్యే జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తెచ్చేందుకు పనిచేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఈ దేశం కోసం మహాత్మాగాంధీ, నెహ్రూ, ఇంధిరా గాంధీ, రాజీవ్ గాంధీలు తమ ప్రాణాలను సైతం అర్పించారని గుర్తు చేశారు. నేడు దేశంలో అధికారంలో ఉన్న బిజేపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాసే విధంగా పని చేస్తుందని విమర్శించారు. దేశ సంపదను కొంత మంది బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టాలని చూస్తుందని ఆరోపించారు. కేంద్రంలో యువ నాయకుడు రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే వరకు కేంద్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేంత వరకు ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త నిర్విరమంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు కార్యకర్తలందరు ప్రతి గడపకు చేరవేయాలని కోరారు. 140 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. దేశంలో పలు ప్రాజెక్టులు దేశంలో పెద్ద పెద్ద సంస్థలను జాతికి అంకితం చేసిన ఒకే ఒక్క పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, కంప్యూటర్ యుగాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ భారత దేశానికి పరిచయం చేసిందని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ దేశాభివృద్ధికి చేసిన చారిత్రక సేవలను గుర్తు చేశారు. అనంతరం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పరిరక్షణకు కాంగ్రెస్ నిరసన చేపట్టారు. గ్రామీణ పేదల జీవనాధారమైన ఈ పథకాన్ని బలహీనపరచే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు.మహాత్మా గాంధీ పేరుతో అనుసంధానమైన ఈ పథకం కోట్లాది కుటుంబాలకు ఉపాధి కల్పించిందని, దాని గౌరవం కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాస్వామిక శక్తిపై ఉందన్నారు. పేదల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యదళ్లపల్లి అనసూయ, సర్పంచులు ధనసరి స్రవంతి, బానోత్ శారద, తాటి యశోద, పాయం స్వాతి, మెచ్చా సాయమ్మ, పాయం లలిత, వల్లాల మంగమ్మ, బాలకృష్ణ, నాయకులు జాఫర్, సుదర్శన్ కోరి, ఇమామ్, నంద కిషోర్, జీవి భద్రం, కొక్కు నాగేశ్వరావు, అంకెపాక నవీన్, ఈసం లక్ష్మణ్, అరెం కిరణ్, పూనెం సురేందర్, కాకటి భార్గవ్, బండి ఆనంద్, ఎట్టి హరికృష్ణ, దండుగుల శివ, పింగళి నరేష్, గాలిపల్లి స్వరూప, వెంకటమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అఖిలపక్షాన్ని డిల్లీకి తీసుకెళ్లి ధర్నా



**ఇల్లందు, డిసెంబరు 28, ప్రజాజ్యోతి:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్రంలోని అఖిలపక్ష ప్రజాప్రతినిధులు, నాయకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బిసి సంఘాల రాష్ట్ర జేఏసీ కన్వీనర్ మడత వెంకట్ గౌడ్ కోరారు. ఆదివారం ఏక్తా హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ సంఘాల అభివృద్ధి కోసం 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న కృతనిత్యంతో అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టగా అన్నిపక్షాలకు చెందినవారు మద్దతు ఇచ్చారని దీన్ని తెరపైకి తీసుకువచ్చి బీసీలకు న్యాయం చేయాలన్న సీఎం పట్టుదల కృషికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ రిజర్వేషన్ ను పూర్తిస్థాయిలో సాధించాలంటే కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో పాటు రాష్ట్రంలోని అన్ని పార్టీలకు చెందిన అధినాయకులు అందరిని కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. 42 శాతం రిజర్వేషన్ కల్పన కోసం ఈనెల 31న హైదరాబాదులో అఖిలపక్ష సమావేశంలో బీసీ సంఘ ఉద్యమ కార్యచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని ఏ విధంగా అయితే సాధించుకున్నామో అదే తరహాలో బహుజన సంఘాల ఐక్యత రాగంతో 42 శాతం రిజర్వేషన్ సాధించుకునేందుకు దశల వారి ఉద్యమాలను చేపట్టనున్నట్లు, అందులో భాగంగానే ఈ నెల 31న జరిగే అఖిలపక్ష సమావేశంలో అనేక తీర్మానాలను బీసీ సంఘం ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా త్వరలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో బీసీ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏక్తా హౌస్ సభ్యులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ పేరును తొలగించడం దుర్మార్గం

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాల్వంచలో నిరసన.

**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 28(ప్రజా జ్యోతి):** గ్రామీణ పేదల జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ పితను అవమానించిందని,ఈ నిరంకుశ నిర్ణయాన్ని ప్రజలు తిప్పికొట్టాలని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్,డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు.రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు, పీసీసీ–డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న నాయకత్వ సూచనలతో పాల్వంచ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కొత్వాల శ్రీనివాసరావు నాయకత్వం వహించారు.నల్ల బ్యాడ్జీలు ధరించిన కాంగ్రెస్ శ్రేణులు పాల్వంచ మెయిన్ మార్కెట్‌లో ర్యాలీగా సాగుతూ “మహాత్మా గాంధీ అమర్ రహే”, “కాంగ్రెస్ పార్టీ జిందాబాద్”, “బీజేపీ డౌన్ డౌన్” అంటూ నినాదాలు చేశారు.అలాగే రాహుల్ గాంధీ, సోనియా గాంధీ,మల్లిఖార్జున్ ఖర్గే నాయకత్వం వర్ధిల్లాలంటూ నినదించారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ,2006లో అప్పటి కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో,మన్మోహన్ సింగ్,సోనియా గాంధీల నాయకత్వంలో సంవత్సరానికి 100 రోజులు ఉపాధి కల్పించేలా మహాత్మా గాంధీ పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు.అలాంటి చారిత్రక పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని,వెంటనే గాంధీ పేరును పథకం పేరులో పునఃచేర్చాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు నిరసనలు చేస్తాం అన్ని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలే జానకిరెడ్డి,మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య,జిల్లా ఐ ఎన్ టీ యూ సి అధ్యక్షులు ఎస్.ఏ.జలీల్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న గౌడ్,యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పైడిపల్లి మహేష్,కాంగ్రెస్ నాయకులు మహీపతి రామలింగం,సాదం రామకృష్ణ,బద్ది కిషోర్,ఎస్వీఆర్కే ఆచార్యులు, వై.వెంకటేశ్వర్లు,చింతా నాగరాజు,కాపర్తి వెంకటాచారి,కనగాల నారాయణ రావు,గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి,పెండ్యాల కృష్ణమూర్తి,పాల్గొన్నారు.



## పెద్దమ్మతల్లి దర్శనంతో కిటకిటలాడిన దేవస్థానం





**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 28(ప్రజా జ్యోతి):** పెద్దమ్మగుడి దేవస్థానములో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పెద్దమ్మతల్లిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాలతో పాటు,జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.భక్తులు అమ్మవారి కృపకు పాత్రులమవాలని ప్రార్థిస్తూ బోనాలు సమర్పించారు.కార్తీకమాసం సందర్భంగా దేవాలయ ఆవరణలోని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.అన్నప్రాశనాలు,వాహనపూజలు,తలనీలాలు,అమ్మవారికి ఒడిబియ్యం,చీరలు,కనుములు తదితర మొక్కులు భక్తులు చెల్లించారు.అనంతరం అమ్మవారి,స్వామివారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**భక్తులను అలరించిన హరికథ:** ఈ సందర్భంగా తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ,దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.దేవాలయ ప్రాంగణంలోని కళావేదికపై నాగార్జునసాగర్‌కు చెందిన సిహెచ్.శ్రీనివాస్ "గంగాదేవి మహాత్యం"హరికథను ప్రవచించగా, ఆయన హరికథ భక్తులను ఎంతగానో అలరించింది.ఈ తరహా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి మరియు పాలకమండలి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

## టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జోగ రాంబాబు ఎన్నిక

- ఆళ్ళపల్లి మండల కమిటీ హర్షం



**ఆళ్ళపల్లి. డిసెంబర్28. ప్రజా జ్యోతి:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపిటిఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జోగ రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం పట్ల ఆళ్ళపల్లి మండల కమిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పాల్వంచలోని బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.ఏకగ్రీవ ఎన్నిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జోగ రాంబాబును మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోతు భోజ్య, ఈసం ముత్తయ్య అభినందించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాంబాబు నిరంతరం కృషి చేస్తారని, ఆయన నాయకత్వం జిల్లాలోని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘం బలోపేతానికి అందరం కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె. లక్ష్మీనారాయణ, జి. కుమార్ రాజా, ఎన్. రామకృష్ణ, నాగమణి, కె. రామయ్య, నెహ్రూ, భద్రు, రవి, బిక్షమయ్య, భద్రమ్మ, లాలయ్య, శ్రీను, చిన్న, నీలావతి, వసంతరావు, ప్రసాదరావు ఇల్లందు (టీపిటిఎఫ్) మండల శాఖ తదితరులు పాల్గొని రాంబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలు సమర్పించాలి ఎంపిడిఓ రామారావు

**ములకలపల్లి, డిసెంబర్ 28, ప్రాజాజ్యోతి:** డిసెంబర్ 14, 2025న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేసి, గెలిచిన మరియు ఓడిపోయిన అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను సమర్పించాలని ఎపిడిఓ రామారావు తెలిపారు. జమ ఖర్చుల వివరాలను డిసెంబరు 29న జిల్లా ఎన్నికల సంఘానికి సమర్పించాలని, నేడు ఉదయం 11.00లోపు పోటీచేసిన అభ్యర్థులు తప్పనిసరిగా స్వయంగా హాజరై, ఎన్నికల ఖర్చుల పూర్తి వివరాలు, బ్యాంక్ లేదా పోస్ట్ ఆఫీస్ స్టేట్మెంట్‌లు, అన్ని ఒరిజినల్ బిల్లులను ఎన్నికల ఖర్చుల తనిఖీ అధికారికి చూపించి ఎంపీడిఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఖర్చుల వివరాలు సమర్పించని అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిగా పరిగణించబడతారని తెలిపారు.

# ఉపాధ్యాయుల సేవాభావానికి నిలువెత్తు నిదర్శనం

- పట్వారిగూడెం ఎంపీపీ ఎస్‌లో గ్రంథాలయం ప్రారంభం
- సేవాభావం ఆదర్శ నీయం: ఎమ్మెల్యే జారె





**దమ్మపేట, డిసెంబర్ 28, (ప్రజా జ్యోతి):** దమ్మపేట మండలం,పట్వారి గూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 50 వేల రూపాయలతో గ్రంథాలయ వసతులను ఏర్పాటు చేయడం అభినందనీయమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెచ్చు వెంకటేశ్వర్లు – విజయరాణి దంపతులు తమ కుమార్తె తేజస్విని జ్ఞాపకార్థంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ స్వంత ఖర్చులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. పుస్తకాలు, అలమారలు, కూర్చునే వసతులతో ప్రత్యేక గదిని సిద్ధం చేశారు. ఈ గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే జారె ప్రారంభించి, వ్యక్తిగత బాధను సేవగా మార్చి విద్యార్థుల కోసం చేసిన ఈ కార్యక్రమం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పుస్తక పఠనం విద్యార్థుల జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్ ,ఎంఈఓ కీసరి లక్ష్మీ , దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాకా రమేష్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పొదిలి జ్యోతి,దిశా కమిటీ సభ్యురాలు సొంగా ఏసుమణి , స్థానిక సర్పంచ్ కూరం అర్జున్ రావు, ఉపసర్పంచ్ బొల్లికొండ నాగేశ్వర రావు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లి దండ్రులు ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా బీసీ సంఘం ఆధ్వర్యంలో మహంకాళికి ఘన సన్మానం

- జిల్లా ఉపసర్పంచుల అధ్యక్షునిగా ఎన్నికపై హర్షం



**బూర్గంపహాడ్,డిసెంబర్ 28, (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మహంకాళి రామారావు నియామకంపై పినపాక నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు ఘనంగా శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులు లావడ్య రాములు నాయక్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా బీసీ వర్గ ముద్దుబిడ్డ ఇరవెండి గ్రామ పంచాయతీకి చెందిన మహంకాళి రామారావును అధికారికంగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షులుగా బీసీ సంఘం అభివృద్ధి కొరకు అహర్నిశలు పాటుపడే వ్యక్తిత్వం ఉన్న రామారావు జిల్లా ఉప సర్పంచుల సంగం అధ్యక్షులుగా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో రాజకీయ రంగంలో పదోన్నతులు సాధించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఉప సర్పంచుల బలోపేతం చేయడంతో పాటు బీసీ వర్గ అభివృద్ధికి తోడ్పడాలని, పంచాయతీ ఉప సర్పంచ్ గా కార్యాచరణ అమలులో క్రియాశీలకంగా పని చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ఉపాధ్యక్షుడు మెండే చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజ్జంకి కనకచారి, నియోజకవర్గ అధ్యక్షులు నిదానపల్లి బాలకృష్ణ, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు వారాల వేణు,మండల అధ్యక్షులు దాసరి సాంబ, ఉపాధ్యక్షులు చిప్పా రాజు, మండల కార్యదర్శి మండల కార్యదర్శి నరసింహారావు,వట్టికొండ రామకృష్ణ,విద్యార్థి సంఘం నాయకులు జక్కుల సందీప్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## వనవాసీ పరిషత్ కు బియ్యం వితరణ





**చర్ల, డిసెంబర్ 28 :(ప్రజా జ్యోతి ) :** చర్ల మండలంలో ఆదివారం చర్ల పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న మురళీ – సింధుకుమారి దంపతుల కుమార్తె నియాన్షి జన్మదిన వేడుకలో భాగంగా చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయంకు 60 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, స్వీట్స్, పండ్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మురళీ విద్యార్థులను ఉద్దేసించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ చదువులపై దృష్టిసారించాలని అన్నారు. క్రమశిక్షణతో మెలగి పాఠశాలలో బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని పేర్కొన్నారు. ఇతర వ్యాపకాలపై దృష్టిసారించకుండా చదువులపై మనస్సు నిమగ్నం చేయాలని సూచించారు. ప్రస్తుత రోజులలో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నందున ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని పేర్కొన్నారు. విద్యతో అనేక కుటుంబాలు స్థిరపడ్డాయని, ఇటువంటి వారిని ఆర్శంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. వనవాసీ విద్యార్థులు క్రమశిక్షణ, సంస్కృతీ సంప్రదాయాలకు మారుపేరని, ఈ పేరును సార్ధకత చేకురుస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థినిలయ కా ర్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ సంస్థకు వితరణ అందచేసిన ము రళీ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు దాతలు అందచేస్తున్న వితరణలకు సార్ధకత చేకూరుస్తూ చదువులలో రాణించాలని కోరారు. విద్యార్థుల చదువులకు వితరణలను అందించేందుకు మరింత మంది ముందుకురావాలని తద్వారా వారి బంగారు భవిష్యత్ లో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నిలయ కమిటి ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, వనవాసీ ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు, నిలయ కమిటి సభ్యులు పాసికంటి శ్రీదేవి, పోలిన రమాదేవి, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

## దివ్యాంగునికి నిత్యవసరాల వితరణ



**చర్ల, డిసెంబర్ 28: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో ఆదివారం మృదు స్వభావి స్నేహమంటే ప్రాణమిచ్చే మంచి మనసున్న వాడు ఇతరుల కష్టాన్ని తన కష్టంగా భావించి ముందు నిలిచే మద్ది లక్ష్మీనరసింహారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన మిత్రబృందం రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన ఐతంరాజు సురేష్ ఈశ్వరి దంపతుల కుమారుడు దివ్యాండగుడైన అనిల్ (21) కి 25 కిలోల బియ్యం నిత్యవసర సరుకులను వారికీ అందజేశారు. ఈ సందర్భంగా యువ న్యాయవాది మాట్లాడుతూ పుట్టుకతోనే శరీర ఎదుగుదల లేక మంచానికే పరిమితమైన అనిల్ కుటుంబానికి మిత్రుడి జన్మదిన సందర్భంగా చిరు సహాయం అందించామని నేటి యువత పుట్టినరోజులు పెళ్లి రోజులు అంటూ వృధాగా డబ్బులు ఖర్చు చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా పలు సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ బొబ్బిలిపాటి రవి కిరణ్ శివరాజుల కిషోర్ గోగికార్ ముసలి సతీష్ రామలక్ష్మణ్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఈడి బాంబుల నిర్వీర్యం

**చర్ల, డిసెంబర్ 28: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్‌లోని గంగలూర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ఎఫ్ ఓ బి కొప్పగూడలో ఉన్న సి ఆర్ పీ ఎఫ్ 199 బెటాలియన్‌కు చెందిన బృందం, ఎఫ్ ఓ బి పిడియా ప్రాంతంలోని ప్రాంతములో సెర్చ్ ఆపరేషన్ లో మందుపాతర తొలగింపు విధుల్లో ఉన్న సమయంలో పిడియా శిబిరం నుండి రెండు కిలోమీటర్ల దూరంలో, నిర్మాణంలో ఉన్న రహదారికి దాదాపు 50 మీటర్ల దూరంలో మావోయిస్టులు అమర్చిన రెండు ఐ ఈ డి లను మందుపాతర నిర్మూలన చేస్తున్నప్పుడు భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నారు. అన్ని భద్రతా ప్రమాణాలను అనుసరించి, సి ఆర్ పీ ఎఫ్ 199 బెటాలియన్ యొక్క బి డి డు బృందం సహాయంతో వాటిని అక్కడికక్కడే సురక్షితంగా నిర్వీర్యం చేశారు. స్వాధీనం చేసుకున్న ఐ ఈ డి లలో ఒకటి టిఫిన్ బాక్స్‌లో మరొకటి బీర్ బాటిల్‌లో అమర్చారు. రెండు ఐ ఈ డి లను ప్రెజర్ మెకానిజమ్‌లను ఉపయోగించి అమర్చారు. భద్రతా దళాల అప్రమత్తత సత్వర చర్య సకాలంలో చేపట్టటంతో వారు మావోయిస్టు కుట్రను భగ్నం చేసారు . బీజాపూర్ పోలీసులు భద్రతా దళాలు ఈ ప్రాంతంలో శాంతి, భద్రత అభివృద్ధిని నిర్ధారించడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాయి అని అధికారులు తెలియచేసారు .





## కాంగ్రెస్ లో చేరిన గొంపల్లి సర్పంచ్ అశోక్



**చర్ల, డిసెంబర్ 28: (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో ఆదివారం గొంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ చార్నీలా అశోక్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చర్ల మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి రామకృష్ణ, జవ్వాది రవికుమార్ ,మాజీ మార్కెట్ సొసైటీ చైర్మన్ పరుచూరి రవి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు .ఈ సందర్భగా అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పథకాలు , కాంగ్రెస్ ప్రభుత్వం చేసే మంచి పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి అని గొంపల్లి గ్రామ ప్రజల ద్వారా ఎన్నికైన నేను గ్రామ ప్రజల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరటం ఎంతో ఆనందంగా ఉంది అని గొంపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధికి నా వంతు నేను కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలహాలను పాటిస్తూ పంచాయతీ అభివృద్ధి చేసేలా పనిచేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో పొన్నం శ్రీను గూడపాటి అప్పారావు బండారి బాబు రావు , బొడ్డు రాంబాబు గారు, కొంగురు శ్యాంసుందర్, వంటకాల సతీష్, మల్లెల సంతోష్ కుమార్ , కర్నాటి ప్రసాద్ , చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం , ఉప సర్పంచ్ కాపల కృష్ణార్జున రావు లింగాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోతు మంగ, ఉప సర్పంచ్ తడకల నరేష్ మాజీ ఎంపీటీసీ మడకం పద్మ ,మొడం ఆదినారాయణ ఆవుల పుల్లారావు, ఆవుల బాబురావు, చింతలపూడి లక్ష్మీనారాయణ, నాయకులు గొంపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీల అమలే ధ్యేయం ఎమ్మెల్యే జారె





**దమ్మపేట, డిసెంబర్ 28, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జారే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షాన నిలబడి పోరాడుతుందని తెలిపారు. రైతులు, కూలీలు, మహిళలు, యువత సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజాప్రయోజనకర పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పార్టీ మరింత బలోపేతం కావాలంటే ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని కోరారు.ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# ఏరు ఉత్సవాల్లో కళల సందడి

- ప్రత్యక్ష చిత్రలేఖనంతో సందర్శకులను ఆకట్టుకున్న చిత్రకారులు





**భద్రాచలం ,డిసెంబర్ 28,ప్రజాజ్యోతి** :ఏరు ఉత్సవాల్లో భాగంగా కళాకారులు నిర్వహించిన ప్రత్యక్ష చిత్రలేఖన కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గోదావరి నది తీరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్ ఆర్ట్ స్పేస్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిత్రకారులు తమ సృజనాత్మకతను కాన్వాస్‌పై ఆవిష్కరిస్తూ ఉత్సవాలకు ప్రత్యేక శోభను చేకూర్చారు.ప్రకృతి సౌందర్యం నడుమ గోదావరి ప్రవాహాన్ని, నది ఒడ్డుని జీవన శైలిని, పర్యావరణ పరిరక్షణ సందేశాలను ప్రతిబింబించేలా చిత్రాలు రూపుదిద్దుకోవడం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కళాకారులు రంగులు అద్దుకుంటూ చిత్రాలను సృష్టించే ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించిన సందర్శకులు ఉత్సాహంగా స్పందించి, కళాకారులను ప్రశంసించారు. ఈ ప్రత్యక్ష చిత్రలేఖన కార్యక్రమం ద్వారా స్థానిక కళాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభించడంతో పాటు, యువతలో కళల పట్ల ఆసక్తిని పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషించిందని నిర్వాహకులు తెలిపారు. కళ, సంస్కృతి, ప్రకృతి సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఏరు ఉత్సవాలకు కొత్త ఆకర్షణగా నిలిచి, సందర్శకులకు మరపురాని అనుభూతిని అందించిందని పేర్కొన్నారు.

## ఆదివాసి చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

- ఆదివాసీ జెఏసి నాయకులు..



**ములకలపల్లి, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి** : ఆదివాసి చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసి జేఏసీ నాయకులు ఓకే రవి మండలంలోని సర్పంచులు తానం పద్మ, గడ్డం సుజాత, వాడే రాములు, సోడే చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. మండల పరిధిలోని చవిటిగూడెం గ్రామంలో సర్పంచులు ఆదివాసి జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు.. మూకమామిడి, జగన్నాథపురం, ములకలపల్లి, మాదారం, చాపరాల పల్లి కేంద్రాలలో సుమారు 300 మంది ర్యాలీ లో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ..ఎన్నేళ్లు గడుస్తున్నా ఆదివాసీలకు ఎస్టీ ప్రతిఫలాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. ఆదివాసి చట్టాలు, పెస చట్టాలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం వల్లే ఆదివాసీలు ఇప్పటికీ అట్టడుగునే వెనుకబడి ఉన్నారు.. ఆదివాసి, పెస చట్టాలను అధికారులు, ప్రభుత్వాలు తుంగలో తొక్కి ఉన్న ఏజెన్సీలోని ఆర్థిక ఖనిజ వనరులను పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు.. ఏజెన్సీ ప్రాంతాలైన గిరిజన గ్రామాలైన చాపరాల పల్లి, కుమ్మరిపాడు గ్రామాలను సైతం నాన్ ఏజెన్సీగా మార్చడానికి కొంతమంది కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికైనా ఆదివాసీలు ఐక్యంగా పనిచేసి మన చట్టాలను కాపాడుకోవాలని కోరారు.. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు గడ్డం ఉదయ్, పొడియం ప్రేమ్, తాటి రవి, తాటి ప్రవీణ్, కోర్స ప్రసాద్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## పేద ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన పార్టీ

- ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- స్వాతంత్రం తెచ్చింది, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ నే : ప్రభాకర్
- ఉపాధి పథకం నుంచి గాంధీ పేరు తొలగింపుతో బీజేపీ విధానం బట్టబయలు: బత్తుల అంజి

**ములకలపల్లి, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి** : పేద ప్రజల ఆకాంక్షల నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ అని, అటువంటి పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటామని పార్టీ జిల్లా నాయకులు బత్తుల అంజి, మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్, భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజిలు పాల్గొని మాట్లాడారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం కాంగ్రెస్ శ్రేణులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం తీసుకువచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, 60 ఏళ్లుగా మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. గరీబో హటావో నినాదంతో దేశంలో పేదరిక నిర్మూలనకు కృషి చేసిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలను వారు గుర్తుచేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం విచారకరమని, దీని వల్ల బీజేపీ విధానాలు ప్రజలకు స్పష్టంగా అర్థమవుతున్నాయని విమర్శించారు. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలను కొనియాడారు. దేశానికి, రాష్ట్రానికి గొప్ప నాయకులను అందించిన కాంగ్రెస్ పార్టీని కాపాడుకొని, భవిష్యత్ తరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి మాజీ పీఏసీఎస్ చైర్మన్ కరటూరు కృష్ణ, వైస్ చైర్మన్ పువ్వాల మంగపతి, జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొప్పుల రాంబాబు, ఖాదర్ బాబా, పాలకుర్తి రత్నభూషణం, గాదెగోని జగదీశ్, పసుపులేటి గణపతి, మీడియం నారాయణ, సోయం బోడప్ప, మడకం శ్రీను, కొప్పుల రాంబాబు, సురభి రాజేష్, శేషమటం వెంకటేశ్వరరావు, గుర్రం కృష్ణమూర్తి, ముదిగొండ శ్రీను, దుగ్గి సంపత్, పద్దం నాగరాజు, జమిలి ప్రదీప్, మడకం రవి, మహిళా కాంగ్రెస్ నాయకులు గుర్రం జయసుధ, బూరుగుపల్లి పద్మశ్రీ, అశ్వారావుపేట నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పాలకుర్తి సమిత్, ములకలపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలకుర్తి రవి, తదితరులు పాల్గొన్నారు.




## మందలపల్లిలో ఘనంగా కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- పార్టీ జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్‌తో సందడి



**దమ్మపేట, డిసెంబర్ 28, (ప్రజాజ్యోతి)**: దమ్మపేట మండలం,మందలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పర్వతనేని వరప్రసాద్ షాపు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన త్యాగాలు, ప్రజా సేవా కార్యక్రమాలను గుర్తు చేశారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణే కాంగ్రెస్ పార్టీ బలమని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ మరింత కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, అభిమానులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.వేడుకలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయని నాయకులు తెలిపారు.

## దమ్మపేటలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

- రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ



**దమ్మపేట, డిసెంబర్ 28, (ప్రజాజ్యోతి)**: దమ్మపేట మండల కేంద్రంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పా ల్గొన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించా రు. అనంతరం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నశెట్టి చిట్టిబాబు పార్టీ జెం డాను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు పానుగంటి సుబ్బారావు, అత్తులూ రి వెంకటేశ్వరరావు, రామబ్రహ్మం, చవ్వా పోలయ్య తదితరులు విగ్రహానికి పూలమాలలు వేశారు. సేవాదళ్ సభ్యులు 'జై కాంగ్రెస్', 'జై జై కాంగ్రెస్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం స్వీట్లు పంచి వేడుకలను ఉత్సాహంగా కొనసాగించా రు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, ఉప స ర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, చాట్ల శ్రీ నివాసరావు, నాయకులు వేముల శ్రీను, వనమాల శ్రీనివాసరావు, గట్ల నాగరాజు, పగడాల కృష్ణ, బోయిన రామకృష్ణ, పసుమర్తి చిన్నబాబు, తాళ్ళ శంకర్, శ్రీరామమూర్తి, దాసరోజు రామారావు, పానుగంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం నిరంతరం పనిచేస్తున్న పార్టీ కాంగ్రెస్

- సర్పంచ్ కుంజా వినోద్
- ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ములకలపల్లి, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి** : అధికారం ఉన్నా లేకున్నా, స్వాతంత్ర్యానికి ముందునుంచి దేశం కోసం, దేశ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ అన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి జగన్నాథపురం ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి నేటితో 140 సంవత్సరాలు పూర్తై 141వ వసంతంలోకి అడుగుపెడుతోందని తెలిపారు. 140 సంవత్సరాల ఘన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నా లేకపోయినా పేద ప్రజల పక్షాన, దేశ ప్రజల కోసం పోరాడిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన సాగుతోందని, రైతులు, కూలీలు, మహిళలు, యువతకు మేలు చేసే అనేక సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని అన్నారు. పార్టీ మరింత బలపడాలంటే ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగన్నాథపురం ఉప సర్పంచ్ జలగం మాధవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పామర్తి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు కొప్పుల రాంబాబు, మడకం బోడప్ప, సురభి రాజేష్, పిడియాల బుజ్జిబాబు, పిడియాల వెంకటేశ్వర్లు, గాదెగోని జగదీష్, మిడియం నారాయణ, కూరం రామకృష్ణ, శేషగిరి, రమాచారి, యాకుబ్ పాషా, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గిరిజన దర్బార్



**భద్రాచలం, డిసెంబర్ 28,ప్రజాజ్యోతి** :భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని ఆయన తెలుపుతూ సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

## తాళ్లపాయి పంచాయితీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కు వినతి



**ములకలపల్లి, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి**: తాళ్లపాయి గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గారికి ఆదివారం తాళ్లపాయి పంచాయతీ సర్పంచ్ గడ్డం సుజాత –ఉదయ్ విన్నవించారు. తాళ్లపాయి పంచాయతీ కి రేషన్ షాపు మంజూరు చేయడంతో పాటు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు విద్యుత్ లైన్, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జారే విద్యుత్ ఏఈ కి ఫోన్ చేసి జనవరి నెలలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు. తాళ్యాపాయి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పిస్తానని, నూతన రేషన్ షాప్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ గడ్డం సుజాతను, ఉప సర్పంచ్ కొండ్రు అనూషను శాలువతో ఎమ్మెల్యే ఆయన స్వగృహంలో సన్మానించారు.. వీరితో పాటు వార్డ్ మెంబర్ మడకం రమేష్, సోడే సాయి తదితరులు ఉన్నారు.

## అక్రమ ఇసుక నిల్వలు సీజ్



**ములకలపల్లి, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి** : మండలపరిధిలోని సీతారాంపురం గ్రామంలోని ముర్రేడు వాగు సమీపంలో అనుమతులు లేకుండా నిల్వ చేసిన ఇసుక రాసులను ఆదివారం రేవిన్యూ అధికారులు సీజ్ చేసారు. స్థానిక గిర్దా వర్ భద్రు తెలిపిన వివరాల ప్రకారం సీతారాం పురం గ్రామంలో అక్రమంగా ఇసుక నిల్వలు ఉన్నాయనే సమాచారం మేరకు స్థానిక తహశీల్దార్ భగవాన్ రెడ్డి ఆదేశాలతో తనిఖీలు నిర్వహించగా మొర్రెడు వాగు సమీపంలో అనుమతులు లేకుండా నిల్వ చేసిన సుమారు 06 ట్రాక్టర్ ల ఇసుకను గుర్తించి, సీజ్ చేసి రేవిన్యూ కార్యాలయానికి తరలించినట్లు ఆర్ ఐ తెలిపారు.

## ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి



**అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 28, ప్రజా జ్యోతి** :అన్నపురెడ్డిపల్లి మండ ల కేంద్రం పరిధిలోని జానికిపురం గ్రామంలో ఆదివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం రాజపురం గ్రామానికి చెందిన జోరిగల వెంకటేశ్వరావు (36) వ్యవసాయ పరికరాల కోసం రాజపురం గ్రామం నుంచి యర్రగుంట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, జానికిపురం గ్రామ సమీపంలో కంకర్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద తీవ్రత కారణంగా మృతదేహం ఒక చోట, తల భాగం మరో చోట పడినట్లు స్థానికులు తెలిపారు.మృతుడికి భార్యతో పాటు ఒక కుమార్తె ఉన్నారు. ఘటన సమాచారం అందుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# కిన్నెరసానిలో ఘనంగా గిరిజన గురుకుల స్వర్ణోత్సవ వేడుకలు

- అడవుల్లో పుట్టిన అక్షరాలు.
- విద్య ఆయుధంగా ప్రపంచాన్ని వెలిగిస్తున్న కిన్నెరసాని.
- యాభై ఏళ్ల వెలుగు కిన్నెరసాని గిరిజన గురుకుల విద్యార్థుల స్వర్ణోత్సవం
- పూర్వ విద్యార్థుల కలయికతో కిన్నెరసాని స్వర్ణోత్సవ వేడుకలకు వైభవం.







**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 28(ప్రజాజ్యోతి)**:అడవుల మౌనానికి అక్షరాల శబ్దాన్ని జోడించి,గిరిజన విద్యార్థుల జీవితాలకు వెలుగులు నింపిన కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. యాభై ఏళ్లుగా విద్యను ఆయుధంగా చేసుకుని సమాజానికి సేవ చేసే అనేకమంది విద్యావంతులను తయారు చేసిన ఈ గురుకులం,ఒక విద్యాసంస్థకే కాక గురుశిష్య పరంపరకు జీవంత సాక్ష్యంగా నిలిచింది.చెట్ల నీడలో మొదలైన చదువు, నదీ గాలిలో పరిమళిస్తూ విద్యార్థుల జీవితాలకు దారి చూపిన ఈ మహా ప్రయాణం స్వర్ణోత్సవ వేళ మరింత భావోద్వేగంగా మారింది. ఆనాటి గురువుల ప్రేమ, శిష్యులలో నాటిన విలువలు, పుస్తకాల మధ్య పుట్టిన కలలు ఈ వేడుకలో మళ్లీ జ్ఞాపకాలుగా కదిలాయి.స్వర్ణోత్సవంలో భాగంగా పైలాన్ ఓపెనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎక్కడెక్కడో ఉన్న పూర్వ విద్యార్థులు కిన్నెరసాని గురుకులం పిలుపుకు స్పందించి ఒక్కచోట చేరడం,అక్షరాల బంధానికి ఉన్న శక్తిని చాటింది. కాలం మారినా గురు శిష్యుల మధ్య గౌరవం, కృతజ్ఞత, అనుబంధం అదే స్థాయిలో కొనసాగుతున్నదానికి ఈ స్వర్ణోత్సవం సాక్ష్యంగా నిలిచింది.ఈ స్వర్ణోత్సవం గతాన్ని గర్వంగా గుర్తు చేసే వేడుకగా,వర్తమానాన్ని ఐక్యతతో నిలిపే వేదికగా,భవిష్యత్తుకు బాధ్యతను అప్పగించే ఘట్టంగా మారిందని పలువురు వక్తలు పేర్కొన్నారు.అడవుల మధ్య పుట్టిన అక్షరాలు నేడు ప్రపంచాన్ని వెలిగిస్తున్నాయని, కిన్నెరసాని గిరిజన గురుకులం సమాజానికి అందించిన అమూల్యమైన ధనమని వారు కొనియాడారు. కిన్నెరసాని గిరిజన గురుకుల స్వర్ణోత్సవానికి శుభాకాంక్షలు.

**గురువులకు వందనం...**
**శిష్యులకు గర్వాభివందనం...**

కిన్నెరసానికి శత శత నమస్సులు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పటేల్,ఐ టీ డి ఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ , ఆర్ సీఓ మేడం,డేవిడ్ రాజ్, కృష్ణ తదితర జిల్లా అధికారులు హాజరై వేడుకను మరింత ఘనంగా తీర్చిదిద్దారు.అలాగే చక్రవర్తి,రమేష్ రెడ్డి,ఖాదర్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్,జి. రమేష్, నిర్వహణ కమిటీ సభ్యులు రమేష్ రాథోడ్,రవి రాథోడ్,వాసం రామకృష్ణ దొర,హతీరం,గొంది వెంకటేశ్వర్లు, పడిగా సత్యనారాయణ,తావురియా వెంక న్న, రాజేష్, వెంక టేశ్వర్లు, రాంబాబు,స్థానిక సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణావతారంలో భద్రాద్రి రామయ్య

- నేడు తిరుమంగైశ్వార్ పరమపదోత్సవం
- నేటి కార్యక్రమాలు





**భద్రాచలం, డిసెంబర్ 28 ,ప్రజాజ్యోతి** : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారు ఆదివారం శ్రీకృష్ణావతారంలో దర్శన మిచ్చారు. 20న ప్రారంభమైన స్వామివారి అవతారాలు ఆదివారంతో ముగిశాయి. తొలుత స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవతారాల్లో భాగంగా శ్రీ కృష్ణావతారుడైన రామయ్యకు వైభవోపేతంగా ఊంజల్ సేవ జరిపారు. ఈ సందర్భంగా ఆస్థాన విద్వాంసులు కీర్తనలు అలపిస్తుండగా ఆలయ అర్చకులు శ్రీకృష్ణుడైన రామయ్యను ఊయల్లో ఊపుతూ వేద మంత్రాలు చదివారు. అనంతరం హారతిని సమర్పించారు. డోలోత్సవంలో పాల్గొని స్వామివారిని చూసి తరించిన భక్తులకు వెయ్యి ఆశ్వమేధయాగ ఫలాలకు దక్కినంత పుణ్యం. సర్వ పాపాలు తొలగి సుఖసంతోషాలు లభిస్తాయని పం డితులు వివరించారు. వెన్న, అటుకులు, బెల్లం భక్తులు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. వీటిని స్వామివారికి నివేదన ఇచ్చి ఆ తర్వాత భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం రామ నామ స్మరణతో మార్మోగింది. స్వామి వారిని దర్శం చుకునేందుకు వచ్చిన భక్తజనంతో పండుగ శోభసంతరించుకుంది. అనంతరం స్వామివారిని పల్లకీపై ఊరేగింపుగా కోలాటాలు, మేళతాళాలు నడుమ మిథిలా స్టేడియంలోని వేదికపైకి తీసు కొచ్చి ఆశీనులు చేశారు. భక్తుల దర్శనార్థం తిరు వీధి సేవ ఘనంగా జరిపారు.

**నేడు తిరుమంగైశ్వార్ పరమపదోత్సవం...**

శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయంలో గురు వారం తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం జరగ నుంది. రామాలయంలోని ఆస్థాన మండవంలో ఈ. ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. తిరుమంగై ఆళ్వార్ స్వామివారి పాదాల చెంత పరమపదించి అనంతరం స్వామివారి అనుగ్రహంతో జీవం పోసు కుంటారు. ఈ నేపథ్యంలోనే ప్రతీ ఏటా తెప్పో త్సవం రోజు ఆలయంలో ఈ ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ.

## యువత క్రీడల వైపు ఆకర్షితులై క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

- జనవరి 10 నుంచి మూడు రోజుల పాటు అవుట్ డోర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్
- కరపత్రాలను ఆవిష్కరించిన పట్టణ ప్రముఖులు పాకాల దుర్గాప్రసాద్

**భద్రాచలం, డిసెంబర్ 28,ప్రజాజ్యోతి** :భద్రాచలం పట్టణంలో జనవరి 10, 11, 12 తేదీలలో భద్రాచలం పట్టణం నిర్వహించనున్న అవుట్ డోర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కరపత్రాన్ని పట్టణ ప్రముఖులు పాకాల దుర్గా ప్రసాద్ ఆదివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పాకాల దుర్గా ప్రసాద్ గారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల వైపు ఆకర్షితులై శారీరక దృఢత్వం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతను సరైన దిశలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. టోర్నమెంటు నిర్వాహకులు మాట్లాడుతూ వరసగా మూడవ సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌ను 10, 11, 12 తేదీల్లో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ లో ప్రథమ బహుమతి రూ.12,000, ద్వితీయ బహుమతి రూ.8,000, తృతీయ బహుమతి రూ.5,000, నాల్గవ బహుమతి రూ.3,000గా నిర్ణయించగా, మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ మరియు ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ కు రూ.1,000 చొప్పున బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్ ప్రవేశ ఫీజు రూ.800గా నిర్ణయించగా, ఎంట్రీల చివరి తేదీ జనవరి 8గా తెలిపారు. భద్రాచలం మరియు పరిసర ప్రాంతాల బ్యాడ్మింటన్ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కుంజా సంతోష్, అంబు, పెద్ద నాగ, చిన్న నాగ, తాటి ఉదయ్, బోళ్ళ కృష్ణ, నారాయణ, డిపో సత్తి, కారం రవితేజ, సవలం వంశీ, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి నది తీరం వద్ద ఘనంగా ఏరు ఉత్సవాల సాంస్కృతిక కార్యక్రమాలు








### నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు, ప్రత్యేక ఆకర్షణగా రిషిత ప్రదర్శన

**భద్రాచలం, డిసెంబర్ 28,ప్రజాజ్యోతి :** ఏరు ఉత్సవాలలో భాగంగా గోదావరి నది తీరం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నదీ తీరమంతా పండుగ వాతావరణంతో కళకళలాడగా, సంప్రదాయ అలంకరణలు, రంగురంగుల దీపాల వెలుగులు, కళా వేదికల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. గోదావరి ప్రవాహం నడుమ సాంస్కృతిక సుగంధం పరిమళించడంతో అక్కడి వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన సాంప్రదాయ, శాస్త్రీయ నృత్యాలు భారతీయ సంస్కృతి–సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబించాయి. శాస్త్రీయ నృత్యాల సమ్మేళనంతో సాగిన ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయగా, ప్రతి నృత్య రూపం తన ప్రత్యేకతతో ఆకట్టుకుంది. గోదావరి నది ప్రవాహానికి తాళం వేసినట్లుగా సాగిన నృత్యాలు భక్తి, ఆనందం, ఉత్సాహాన్ని ఏకకాలంలో కలిగిస్తూ ఉత్సవాలకు మరింత వైభవాన్ని చేకూర్చాయి. కళలు, సంస్కృతి, ప్రకృతి సమన్వయంతో నిర్వహించిన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు ఏరు ఉత్సవాల ప్రధాన లక్ష్యాన్ని మరింత బలపరుస్తూ, నది ప్రాధాన్యతతో పాటు పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాయి. ఈ కార్యక్రమాలు ఏరు ఉత్సవాలను ప్రజల హృదయాల్లో నిలిచిపోయే, మరపురాని అనుభూతిగా మలిచాయని సందర్శకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక ఆకర్షణగా భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు కుమార్తె రిషిత ప్రదర్శించిన సాంప్రదాయ నృత్య ప్రదర్శన నిలిచింది. శాస్త్రీయ నృత్యశైలిలో ఆమె ప్రదర్శించిన అభినయం, లయబద్ధమైన అడుగులు, భావవ్యక్తీకరణ ప్రేక్షకులను ఆకట్టుకొని, కార్యక్రమానికి ప్రత్యేక వన్నెతెచ్చాయి.





## ఆ పాత మధురాలు!

### భద్రగిరిలో ఏడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న తెప్పోత్సవం

**భద్రాచలం కల్చరల్ ,డిసెంబర్ 28,ప్రజాజ్యోతి :** దక్షిణ అయోధ్యగా, భూలోక వైకుంఠంగా భక్తులు భావించే భద్రా చలంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవం ప్రధానమైనది. ఉత్తర ద్వార దర్శనానికి ముందు రోజు రాత్రి గోదావరిలో హంస వాహనంపై మిరుమిట్లు గొలిపే బాణాసంచా, విద్యుత్ దీపాలతో సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామి వారు 'లాహిరి లాహిరి.. లాహిరిలో' అంటూ విహరించే దృశ్యాలు మరువలేనివి. భద్రాచలం వచ్చినభక్తులు తెప్పోత్సవాన్ని కనులారా వీక్షించి, మరుసటి రోజు తెల్లవారుజామున ఉత్తర ద్వారం ద్వారా రామయ్యను దర్శించుకుని మది నిండా మధురానుభూతులతో ఇంటిబాట పడతారు. అయితే 1951లో ప్రారంభమైన ఈ తెప్పోత్సవం మొదట పడవలలో, ఆదిశేషువుని శేష పాన్పు ఆకారంలో, ఆ తర్వాత హంసాకృతిలో అలంకరించిన లాంచీలో నిర్వహించేవారు. ప్రస్తుతం కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా వెలుగుల నడుమ ఈ వేడుకను జరుపుతున్నారు. కొన్ని దశాబ్దాలుగా తెప్పోత్సవ దృశాలు భక్తుల కోసం.




